


వక్రతుండ మహాకాయ
కోటి సూర్య సమప్రభ
నిర్విఘ్నం కురుమేదేవా
సర్వకార్యేషు సర్వదా !
గణనాథుని పూజకు వేళయింది..
జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి
ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని
ఏర్పాట్లు చేశారు. వాడవాడలా గణేశ్
మండపాలు వెలిశాయి.. వర్షంతో
మార్కెట్ కాస్త డల్ అయినా
ఉత్సాహం అయితే తగ్గలేదు..

6

భీమవరం, నరసాపురంలలో మంగళవారం సాయంత్రం కొనుగోళ్ల సందడి

ముస్తాబై వస్తున్నా !



ఇదేం వైద్యం !

- పనిచేసేది ఒకచోట
- ముఖ హాజరు మరోచోట
- ఆ పది మంది డాక్టర్ల తీరిది

ఏలూరు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విధులు నిర్వర్తించాల్సిన పీహెచ్‌సీ ఒకచోట.. ముఖగుర్తింపు ఆధారిత హాజరు(ఎఫ్‌ఆర్‌ఎస్) నమోదు మరోచోట.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పలువురు వైద్యాధికారులు పాటిస్తోన్న పద్ధతి ఇది. మంగళవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ల ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు పరిశీలిస్తే పది మంది తమకు కేటాయించిన పీహెచ్‌సీల్లో కాకుండా వేరేచోట హాజరును నమోదు చేయడం, జంగారెడ్డిగూడెం, విజయవాడల్లో హాజరు వేయడం, మరికొందరు జిల్లా అధికారుల అనుమతి లేకుండా గైర్హాజరవడం వంటివి వెలుగులోకి వచ్చాయి. గతంలో ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదును ఐ ఫోన్లలో ట్యాంపరింగ్ ద్వారా నమోదు చేయడం, పనిస్థానాలకు వెళ్లకుండానే హాజరైనట్టు అటెండెన్స్ వేయడాన్ని అత్యాధునిక సాంకేతికతతో ఎఫ్‌ఆర్‌ఎస్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ ఆధారాలతోసహా గుర్తించి తప్పుడు పద్ధతులను పాటించినందుకు 21 మంది మెడికల్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసిన విషయం విధితమే. తాజాగా మళ్లీ అవే పరిస్థితులు జిల్లాలో కొనసాగుతున్నట్టు తాజా సంకేతాలు రుజువు చేస్తున్నాయి. మంగళవారం విధులకు గైర్హాజరు లేదా మరోచోట ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు చేసిన వైద్యాధికారులకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విడతల వారీగా నిర్వహిస్తోన్న ఎన్‌సీడీ 4.0 ప్రోగ్రాంలో శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలి. వీరిలో పలువురు శిక్షణకు గైర్హాజరు కావడంతో ఈ నెల 28న మలివిడత శిక్షణకు హాజరు కావాలని అధికారులు సూచించారు. నిబంధనల ప్రకారం పనిస్థానంలో విధులు నిర్వర్తించకుండా లేదా ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు చేయకపోయినా తగిన కారణాలను అధికారులకు చూపడంతోపాటు, వారి అనుమతిని తీసుకోవడం తప్పనిసరి. మంగళవారం నాటి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదులో క్రమశిక్షణా రాహిత్యం వెలుగులోకి రావడం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

విద్వేషాలు సృష్టించేందుకే..

- రంగా విగ్రహాలకు పేడ పూశారు..
- ఇద్దరు యువకులు, బాలుడి అరెస్ట్

కైకలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో విద్వేషాలు రేపి, అల్లర్లు సృష్టించేందుకు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పేడ పూసినట్లు కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు యువకులతోపాటు ఓ మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 'ఈ నెల 22 రాత్రి కలి దిండి, సానారుద్ర వరంలోని రంగా విగ్రహాలకు గొల్లగూడెం కు చెందిన కట్టా ఈశ్వర్‌కుమార్(22), కలిదిండికి చెందిన ఉండ్రాల అయ్యప్ప(26)తోపాటు మరో మైనర్ బాలుడు పథకం ప్రకారం విగ్రహాలకు పేడ పూశారు. 23న కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించాం. వీరు ముగ్గురు మంగళవారం కలిదిండి ఏఎంసీ ప్రాంతంలో బైక్‌పై వెళుతుండగా అదుపులోకి తీసుకుని విచారించాం. నేరం అంగీకరించడంతో అరెస్టు చేశాం.గతేడాది ఇదే తేదీల్లో కలిదిండి ప్రాంతంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని మళ్లీ విద్వేషాలు రెచ్చగొట్టినా ఎవరూ గుర్తించలేరని ఈ ముగ్గురిని విగ్రహాలకు హాని కలిగేలా కొందరు ప్రేరేపించారు. ఇలాచేస్తే రెండువర్గాల మధ్యన విద్వేషాలు పెరుగుతాయని, ఒక వర్గానికి హాని కలిగే విధంగా ఉంటుందని ఆలోచన చేశారు.ఈ కేసును మరింత విచారించి వీరి వెనుక వున్న వ్యక్తులను బయటకు తీస్తాం' అని సీఐ వెల్లడించారు.

కలెక్టరేట్ ఫైట్ !

పశ్చిమ గోదావరి జిల్లా శాశ్వత కలెక్టరేట్ నిర్మాణంపై తలోమాట

- పెద అమిరంలో నిర్మించాలన్న డిప్యూటీ స్పీకర్ రఘురామ
- భీమవరం నుంచి ఎక్కడికీ వెళ్లదన్న ఎమ్మెల్యే అంజిబాబు
- తరలిస్తే ఉద్యమిస్తామన్న కాంగ్రెస్, వైసీపీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి):



పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవన నిర్మాణంపై ప్రాంతాల వారీగా రాజకీయ పక్షాల్లో చిచ్చు రేపింది. భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడినప్పటి నుంచి కలెక్టరేట్‌పై సస్పెన్స్ కొనసాగుతూనే వుంది. ప్రస్తుతం దీనిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణానికి వైసీపీ హయాంలో భీమవరం ఏఎంసీలోని 20 ఎకరాల భూమిని కేటాయించారు. నాటి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీచేసింది. గెజిట్ నోటిఫికేషన్ విడుదలచేసింది. రాష్ట్ర రహదారులు, భవనాల శాఖకు ఏఎంసీ భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్ భవన సముదాయానికి ఆర్‌అండ్‌బీ ప్రణాళికలు చేయాల్సి ఉంది. ఈలోగా ప్రభుత్వం మారి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ప్రాధామ్యాలు మారాయి. భీమవరం ఏఎంసీకి మరోచోట స్థలం కేటాయించడం కష్టమన్న భావనతో అక్కడ కలెక్టరేట్ ప్రతిపాదనను విరమించుకున్నారు. స్థల సేకరణ ప్రయత్నాలు ప్రారంభించారు. పెద అమిరంలోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో కలెక్టరేట్ నిర్మాణానికి అనువుగా ఉంటుందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రయత్నించారు. దీనిని గతంలో భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు ఖండించారు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని ప్రకటించడంతో అప్పటికి సర్దుమణిగింది. తాజాగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కలెక్టరేట్ అంశాన్ని లేవనెత్తారు. కలెక్టరేట్‌ను భీమవరం నుంచి ఇతర

- మిగతా 9లో..

కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుంది : ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం టౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): "కలెక్టరేట్ భీమవరంలోనే ఉంటుంది.. ఎక్కడికీ వెళ్లదు.. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు, అనుమానాలకు తావు ఇవ్వవద్దు' అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ ఉండి నియోజకవర్గానికి తరలిపోతుందనే వస్తున్న వార్తల నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కలెక్టరేట్ అందరికీ ఉపయోగకరమైనది. అధికారులంతా ఒకేచోట ఉండాలన్నదే నా ఆలోచన. అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండాలంటే 25 ఎకరాల స్థలం అవసరం. దిరు సుమర్రు, గొల్లవానితిప్ప, తాడేరులో స్థలాలను చూస్తున్నాం. గతంలో కలెక్టరేట్‌కు ఐదు ఎకరాలు అంది స్తానన్నా. కానీ 25 ఎకరాలు ఉండాలని, పరేడ్ గ్రౌండ్, వీఐపీల పార్కింగ్ ఇలా ఎన్నో వాటికి స్థలం ఉండాలి' అని అన్నారు.

ఉండి.. భీమవరం వేర్వేరు కాదు
డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



కాళ్ళ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):'కలెక్టరేట్‌ని తరలించుకుపోతున్నామని వైసీపీ నాయకులు యాగీ చేయడం విడ్డూరంగా ఉంది. నా దృష్టిలో భీమవరం, ఉండి వేర్వేరు కాదు. కొంత మంది సంకుచిత ధోరణితో మాట్లాడుతున్నారు' అని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెద అ మిరం ఎప్పటికైనా భీమవరం మునిసిపాలిటీలో కలుస్తుందన్నారు. అన్ని హంగులతో కూడిన కలెక్టరేట్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే తన కోరిక అన్నారు. కాళ్ళ మండలం పెద అమిరం క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్ ఆఫీసు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. భీమవరం మార్కెట్‌యార్డులో కలెక్టరేట్‌కు స్థలం కేటాయించినా అది ముందుకు వెళ్లలేదు. పెద అమిరంలో అన్యాక్రాంతమైన మూడు ఎకరాల 60 సెంట్ల భూమి ప్రభుత్వానికి అప్ప గించాం. ఇక్కడ కలెక్టరేట్ నిర్మించవ చ్చని నిర్మాణానికి రూ.70 కోట్లు అయితే రూ35 కోట్లు ప్రభుత్వం ఇస్తే, రూ.35 కోట్లను సమకూర్చి కలెక్టరేట్ నిర్మిస్తాని సీఎంకు వివరించా. మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఇరిగేషన్ భూమి అని, కోర్టు ఆదేశాలు ఉంటే ఎలా నిర్మాణం చేస్తారనడం విడ్డూరంగా ఉంది. ఇరిగేషన్‌కు ఉన్న అదనపు భూమిని ప్రభుత్వం వాడుకోవచ్చని ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చింది' అని అన్నారు.



భీమవరం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ద్వారకా తిరుమలరావు

ఉచిత ప్రయాణానికి స్మార్ట్ కార్డులు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

భీమవరం టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు స్మార్ట్ కార్డులను అందజేసే ఆలోచన చేస్తున్నామని ఆర్టీసీ సంస్థ ఎండీ ద్వారకాతిరుమల రావు అన్నారు. మంగళవారం భీమవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో పార్సిల్ కార్యాలయం, స్టాల్స్‌ను పరిశీలించారు. జిల్లాలో స్త్రీ శక్తి పథకంలో ఇప్పటికే మహిళలు ఆధార్ కార్డులను చూపించి ప్రయాణిస్తున్నారని అర్హులైన మహిళలకు స్మార్ట్‌కార్డులు అందించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. పల్లెవెలుగు బస్సులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు బస్ ట్రాకింగ్ విధానం అమలు చేస్తామని, ముందుగా గుంటూరు డిపోలో చేస్తామన్నారు. పల్లెవెలుగు బస్సులు కూడా ఏసీ బస్సులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏలూరు వెళుతున్న బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. ఉచిత బస్సు గురించి అడిగారు. స్త్రీ శక్తి పథకం వల్ల ఆర్టీసీకి ఆర్థికంగా నష్టం ఉండదని, నిర్వహణ భారం మాత్రమే ఉంటుందన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లు అప్పలరాజు, విజయరత్నం, ఆర్ఎం వరప్రసాద్, ఇన్‌చార్జి డీఎం సుబ్బ న్నరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బార్‌లకు 30 వరకు గడువు పెంపు



భీమవరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌లకు స్పందన అంతంత మాత్రం గానే ఉంది. దీంతో ప్రభుత్వం మరోసారి గడువు పెంచింది. ఈనెల 30వ వరకు దరఖాస్తు చేసుకునే అవాకశం ఇచ్చింది. వాస్తవానికి మంగళవారంతో గడువు ముగిసింది. జిల్లాలో ఎనిమిది బార్‌లకు ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వేశారు. జిల్లాలో 28 బార్‌లు జనరల్ కేటగిరీకి, మూడు బార్‌లు కల్లుగీత కార్మికులకు కేటాయించారు. చివరి నిమిషంలో అంతా దరఖాస్తులు చేస్తారని ఎక్సైజ్ అధికారులు ఆశించారు. ప్రభుత్వం గడువు పెంచడం వల్ల మళ్లీ వెనక్కు తగ్గారని అంచనా వేస్తున్నారు.నష్టాల బాట పడతామంటూ తర్జన భర్జనలు పడుతున్న బార్ యజమానులు కొత్త లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసే విషయమై ఎక్సైజ్ శాఖలో ఒకింత ఆశాభావంతో ఉన్నారు. దరఖాస్తు చేసుకునే గడువు పెంచడంతో స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

జాతీయ ఉత్తమ అధ్యాపకునిగా దేవానంద్



మండవల్లి/మైలవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా మండవల్లికి చెందిన డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ ఉత్తమ జాతీయ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. గురు పూజోత్సవం రోజు సెప్టెంబరు 5న న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. కృష్ణా జిల్లా మైలవరంలోని లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న దేవానంద్ విద్యార్థులకు విద్యాబోధనలు అందించడమే కాకుండా వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎం.ఏ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ, ఎంఏ హిస్టరీ, బీఈడీ, ఎంఈడీ చేసి యూజీసీ నీట్, స్లేట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించి అధ్యాపకునిగా కెరీర్ ప్రారంభించారు. 38 పరిశోధక పత్రాలు, పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి, ఐదు గ్రంథాలు రాశారు. 2021 నుంచి లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న దేవానంద్ విద్యార్థులలో నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేశారు. జర్నలిజం, తాళపత్ర గ్రంథాల రచన, జీవన నైపుణ్యాలను అనువాదం వంటి విషయాలపై 12 సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించారు. విద్యార్థులతో నిరంతరం మ మేకమయ్యే దేవానంద్ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కళాశాల యూత్ ఫెస్టివల్ వార్షిక పాఠ్యాం శాలపై విద్యార్థులతో విద్యాపరమైన వీడియోలు తీయడం వంటి కార్యక్రమాల్లో కీలకపాత్ర వహించారు. గత ఏడాది సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024ను అందుకున్నారు.

చాలా సంతోషంగా ఉంది

దేశం మొత్తం మీద ఎంపికైన 21 మందిలో నేను ఒకడిని అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అవార్డు మరింత స్ఫూర్తిని నింపింది. ఇలాంటి అవార్డులు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు రావడం విద్యార్థులకు మరింత నమ్మకాన్ని కలిగిస్తాయి.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తు గడువు నేడు

ఏలూరు అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):అంతర్ జిల్లా బదిలీలు కోరుకునే అర్హులైన టీచర్లు ఆన్‌లైన్‌లో ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకుని, మూడు సెట్ల ప్రింటవుట్‌లను సంబంధిత ఎంఈవోకు సమర్పించా లని ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని ఎంఈవోలు 28లోగా, డీఈవో 29న ధ్రువీకరించుకుని పాఠశాల విద్య డైరెక్టర్‌కు 31వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. తుది నిర్ధారణ సెప్టెంబరు 1, 2 తేదీల్లో డైరెక్టరేట్‌లో చేపడతారని వివరించారు. అంతర్ జిల్లా బదిలీలకు అర్హతలు, ఇతర వివరాలు, ప్రొఫా ర్మాల కోసం డీఈవో ఏలూరు. ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

కాల్ లెటర్లు జారీ

మెగా డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులకు రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఏలూరు అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కాల్ లెటర్ల జారీ ప్రారంభమైంది. తొలుత పీజీటీ, టీజీటీ కేడర్ సెలెక్టెడ్ అభ్యర్థుల లాగిన్‌లకు, మధ్యాహ్నం నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీ కాగా, రాత్రికి ఎస్జీటీ కేడర్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందుతాయని భావిస్తున్నారు. అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కాల్ లెటర్‌లో చేసిన సూచనలను అభ్యర్థులు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, మూడు సెట్ల అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తెచ్చుకోవాలన్నారు. వెరిఫికేషన్‌కు హాజరు కావడానికి ముందుగానే అభ్యర్థి అన్ని సర్టిఫికెట్లను ఏపీడీఎస్సీఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్‌ల నుంచి అప్‌లోడ్ చేయాలని స్పష్టంచేశారు. ఏమైనా సందేహాలు వుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 90307 23444, 90523 91111లలో సంప్రదించాలని కోరారు. గురువారం జరుగనున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జిల్లాల్లో ఏర్పాట్లపై పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర నోడల్ ఆఫీసర్లు మంగళవారం రాత్రి వెబెక్స్ విధానంలో డీఈవోలతో సమావేశం నిర్వహించారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాటు చేసిన ముగ్గురు గెజిటెడ్ అధికారులతో కూడిన టీమ్‌ల విధులపై సూచనలు చేశారు. జోన్-2 జిల్లాల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని నియమించినట్టు వెల్లడించారు. సమావేశంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ జ్వరాలు..

- బాధితులతో ఆసుపత్రులు కిటకిట
- వాతావరణ మార్పులతో భయం..
- రోజురోజుకు పెరుగుతున్న పీడితులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జ్వరాలు ప్రజలను భయపెడుతున్నాయి. జ్వర పీడితులతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఇటీవల వర్షాలు కురిసిన నాటి నుంచి జ్వర పీడితులు ఎక్కువగా కనిపిస్తున్నారు. వారం పది రోజులుగా గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందించే వైద్యులు బిజీగా మారిపోయారు. ఎక్కడ చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారని ఆ వైద్యులు సైతం చెబుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు గ్రామాల్లో పీహెచ్‌సీల వద్ద జ్వర బాధితులు పెరుగుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం

వాతావరణ మార్పుల వల్ల వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. డెంగీ, మలేరియా లాంటి జ్వరాలు జిల్లాలో ఎక్కడా నమోదు కాలేదు. ఎప్పటి కప్పుడు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తూనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు జ్వరాలపై సిబ్బందితో వివరాలు తెలుసుకుంటూనే అప్రమత్తం చేస్తున్నాం.

-వీర్ల క్రాంతికుమార్, జిల్లా మలేరియా అధికారి

రోజుకు నాలుగు వేల జ్వర పీడితులు

పశ్చిమగోదావరి జిల్లాలో రోజుకు 4 వేల వరకూ అధికారికంగా జ్వర పీడితులు నమోదవుతున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. అధిక శాతం జ్వర పీడితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించడంతో ఈ సంఖ్య ఎక్కువగానే ఉంటున్నా ప్రభుత్వ లెక్కల్లో మాత్రం స్వల్పంగా కనిపిస్తోంది. ఈ సీజన్‌లో సమగ్రంగా ఫీవర్ సర్వే నిర్వహించడం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయవచ్చని పలువురు చెబుతున్నారు.

కానరాని వైద్య శిబిరాలు

గ్రామాల్లో ఈ సమయంలో జ్వరాలు ఇతర అంటువ్యాధులు ప్రబలే సమయం కావడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఎక్కడా వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని జ్వర పీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి జ్వరానికి ఆసుపత్రికి వెళ్లాలన్నా వేలల్లో ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ జ్వరాలకు సంబంధించి గ్రామాల్లో క్యాంపులు నిర్వహించాలని కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపం

అత్తిలి (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాల నేపథ్యంలో వాతావరణ మార్పులతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కువ మంది జ్వరంతో పాటు దగ్గు, జలుబు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్నారు. మండలంలోని అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులకంటే ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులు ఆశ్రయిస్తున్నారు. ఓపీలో ఎక్కువగా జ్వరాలతో బాధపడేవారే ఎక్కువ. రక్త పరీక్షలను చేయించుకోవాలంటూ ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లోపం కనిపిస్తుంది. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా ఆచరణలో లేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడా ఫాగింగ్, బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. రక్షిత మంచినీటి పథకాలు 15 రోజుల కొకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉండగా ఆ దిశగా పనులు చేపట్టడం లేదు.



గూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు


భీమవరంలో పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్‌లో రద్దీ


పెనుగొండలో గణనాథుడి మట్టి ప్రతిమలతో చిన్నారులు


ఏలూరులో పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

గణపతి పూజకు వేళాయె..

• నేడు వినాయక చవితి • పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక మండపాలు • మార్కెట్‌లో పూజా సామగ్రి


భీమవరంలో పూజా సామగ్రి విక్రయం


తాడేపల్లిగూడెంలో మట్టి ప్రతిమల విక్రయం


ఆకివీడులో పత్రి అమ్మకం


కొయ్యలగూడెంలో విద్యుత్ వెలుగులు


చింతలపూడిలో పూజా సామగ్రి దుకాణాలు


తాడేపల్లిగూడెంలో పూల దుకాణం

ఏలూరు సిటీ/ఏలూరు కార్పొరేషన్/భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్/, పాలకొల్లు అర్బన్/నరసాపురం/తణుకు/ఆచంట/చింతలపూడి/కొయ్యలగూడెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తొలిపూజ విఘ్నేశ్వరుడిదే.. వినాయకుడిని కొలిస్తే సర్వ శుభాలు కలుగుతాయని నమ్మకం. ఉమ్మడి జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఏలూరు రామకోటి సెంటర్, కుండీ సెంటర్, కూరగాయల మార్కెట్, తంగెళ్లమూడి వద్ద భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పవరుపేటలో వందేళ్ల చరిత్ర కలిగిన పదకొండున్నర అడుగుల ఏకశిల విగ్రహంగా కొలువు తీరిన విజయగణపతి ఆలయం, సత్రంపాడు లక్ష్మీ గణపతిస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మంగళవారం నుంచి ముసురేసినా గణేశ ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. భీమవరం పట్టణంలో వీధివీధిన చవితి మండపాలు వెలిశాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు యువత ఏర్పాట్లు చేశారు. 5 అడుగుల విగ్రహాలతో పాటు పలుచోట్ల భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో చామంతి, బంతి పూలు కిలో రూ.250 నుంచి 300 ధరకు విక్రయించగా సాధారణ బంతి పూల దండ రూ.150, గులాబి దండ రూ.500 ధర పలికాయి. దానిమ్మ పండు రూ.50 యాపిల్ రూ.50, అరటిపళ్లు డజను రూ.80 ధరకు విక్రయించారు.

పాలకొల్లు పట్టణంలో మట్టి, పీవోపీతో తయారు చేసిన గణపతి విగ్రహాలు వివిధ సైజుల్లో రంగుల్లో అమ్మకానికి ఉంచారు. పూలు, పండ్లు, పత్రికి డిమాండ్ పెరగడంతో అధిక ధరకు విక్రయించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్ అంతా రద్దీగా కనపడింది. నరసాపురం మెయిన్‌రోడ్ నుంచి శివాలయం సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా పూజా సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డు కిటకిటలాడింది. తణుకు సొసైటీ రోడ్డులో చాక్లెట్ దండలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ దండలతో స్వామి అలంకరణ అనంతరం ప్రసాదం పంచుకునేందుకు వీలుగా ఉండడంతో కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆకివీడు మార్కెట్‌లో గణేశ్ ప్రతిమ, పూలు, పత్రి, పండ్ల ధరలు ఆకాశన్నంటడంతో భక్తుల జేబులకు చిల్లు పడింది. ఆచంట మండలంలో చవితి ఉత్సవాలకు నిర్వాహకులు మండపాలు ఏర్పాటు చేశారు. వినాయకుని ప్రతిమలు, పండ్లు, పువ్వులు, పత్రి కొనుగోలుతో గ్రామాల్లో సందడి నెలకొంది. చింతలపూడి పట్టణంలో బోసుబొమ్మ, గాంధీబొమ్మ సెంటర్లలో పలు దుకాణాలు వెలిశాయి. రంగురంగుల ప్రతిమలు, మట్టి వినాయకులు, పాలవెల్లులు, పూల దుకాణాలు, పండ్ల దుకాణాలతో రద్దీ నెలకొంది. కొయ్యలగూడెం మండలంలో చవితి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబ య్యాయి. ప్రధాన సెంటర్ పూజా సామగ్రి దుకాణాలతో రద్దీగా మారింది.

4.30 గంటలకు

ద్వారకాతిరుమల: శ్రీవిశ్వావసు నామసంవత్సర భాద్రపద శుద్ధ చవితి బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి గణపతి పూజ చేసేందుకు శుభప్రదంగా ఉందని పండితులు చెబుతున్నారు. సెప్టెంబరు 7న ఆదివారం రాత్రి 9.56 గంటల నుంచి చంద్రగ్రహణం. 13, 21 రోజులు వినాయక ఉత్సవాలు నిర్వహించడం సాధ్యం కాదని పండితులు గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ చెబుతున్నారు. నవరాత్రులు చేసుకోవచ్చని వివరించారు.

ఉచిత విద్యుత్

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు విద్యుత్ ఖర్చు ఎక్కువ. ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించడంతో మండపాల వద్ద ఉత్సవ నిర్వహణలో ఆర్థిక భారం తగ్గనుంది. పెద్ద మండపాలకు భారీ కటౌట్లు, విద్యుద్దీపాలకంరణ చేశారు. గ్రామాల్లో డీజే సౌండ్స్, మైక్‌సెట్లతో వినాయక చవితి మండపాల వద్ద సందడి కనిపిస్తోంది. ముందుగా అనుమతి తీసుకోవడంతో విద్యుత్ ఉచితం కానుంది.

ఏలూరులో భారీ మట్టి విగ్రహాలు

ఏలూరు ప్రధాన సెంటర్లలోని గణేశ్ మండపాల్లో భారీ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈ మట్టి విగ్రహాలను ఆయా మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. తంగెళ్లమూడిలో 12 అడుగులు, రామకోటి, కుండీ సెంటర్లలో 25 అడుగుల భారీ వినాయక విగ్రహాలను మట్టితో ఏర్పాటు చేశారు.

అమ్మవారే మట్టికి ప్రాణం పోశారు

పంచభూతాలలో నేల ఒకటి. సాక్షాత్తూ పార్వతీ దేవి అమ్మవారు మట్టి విగ్రహాన్ని చేసి ప్రాణం పోశారు. ఇదే వినాయక జననం. పంచ భూతాల స్వరూపమే పరమేశ్వరుడు. పార్వతీ పరమేశ్వరుని తనయుడైన వినాయకుడిని మట్టితో పూజించాల్సిన అవసరం ఉంది.

- జంధ్యాల కళ్యాణశ్రీ, ఏలూరు

పత్రికి పన్ను పోటు

పాలకొల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పూజలకు అవసరమైన పండ్లు, పత్రి, పూలు, మట్టి వినాయక విగ్రహాలు, ఇతర పూజా సామగ్రి విక్రయానికి చిరు వ్యాపారులు పట్టణ ప్రధాన కూడళ్లు, రోడ్డు మార్జిన్లలో దుకాణాలు ఏర్పాటు చేశారు. రోడ్డు మార్జిన్‌లో విక్రయించే వస్తువులకు పన్ను ఉన్నప్పటికీ, పూజ పత్రికి పన్ను మినహాయింపు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మామిడి, మారేడు, జిల్లేడు, మందార, గన్నేరు, వంటి పత్రి, గరిక, తామర, కలవ పూలు తీసుకువచ్చి అమ్ముకుంటారు. ఒక దుకాణంలో రోజంతా కష్టపడి పత్రి అమ్మితే గరిష్ఠంగా రూ.600 నుంచి 800 వస్తుంది. మునిసిపల్ ఆశీలు గెజిట్‌లో పత్రికి పన్ను లేదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దుకాణదారుల నుంచి పాటదారులు అక్రమంగా పన్ను వసూలు చేస్తున్నారు. ఈవిషయాన్ని బాధితులు మునిసిపల్ కమిషనర్ విజయసారథి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే కమిషనర్ స్పందించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్లు కలెక్టర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పన్ను వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికీ ఆశీలు పాటదారులు అక్రమంగా దుకాణానికి రూ. 50 నుంచి రూ100 వరకూ పన్ను వసూలు చేయడంతో చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

కొనుగోలుదారులు లబోదిబో

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో రహదారుల పక్కన సంచార వ్యాపారులు పూలు, పండ్లు, పత్రి, విగ్రహాలు విక్రయాలకు దుకాణాలు ఏర్పాటు చేశారు. భక్తిభావంతో భక్తులు కొనుగోలు చేయాలని వస్తే ధరలు అధికంగా చెబుతున్నారు. నిన్నటివరకు పది రూపాయలు ఉన్న పూలు, పండ్ల ధరలు అమాంతం పెంచేశారు. రెట్టింపు ధర వసూలు చేశారు. బత్తాయి, యాపిల్, అరటి పండ్ల ధరలతో కొనుగోలుదారులు లబోదిబోమన్నారు. జామ, వెలగ, తదితర కాయలు ఒక్కొక్కటి రూ.50 వరకు విక్రయించారు. మొక్కజొన్న కండె ఒకటి రూ.40 చొప్పున విక్రయించారు. ధరలు అధికంగా ఉన్నా కొనుగోలు చేయకతప్పడంలేదని భక్తులు వాపోతున్నారు. పండ్ల ధరలు గణనీయంగా పెంచడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పండుగను ఆసరాగా చేసుకుని దోచేశారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. మంగళవారం ఒక మోస్తరుగా వ్యాపారాలు కొనసాగాయి. అధిక ధరలు వసూలు చేశారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం ఈ సంచార వ్యాపారులు పండ్లు, పత్రి, పువ్వులు, పూజా సామగ్రి విక్రయించేందుకు జోరుగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. అన్ని చోట్ల అధిక ధరలు ఉన్నాయని పలువురు వాపోయారు.



ఏలూరు మార్కెట్‌లో గణనాథుడికి రంగుల గొడుగులు

ఆకివీడు, ఏలూరులో కలువ పూలు, వెలగ పండ్ల అమ్మకం






పాలకొల్లులో రంగురంగుల గణేశ విగ్రహాలు

మట్టి ప్రతిమలనే పూజించండి : ఎంపీ మహేశ్

ఏలూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చవితి ఉత్సవాల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజించాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సూచించారు. ఈ వినాయక చవితి ప్రజల జీవితాల్లో మరిన్ని సుఖ సంతోషాలు తీసుకురావాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలను ఆయన తెలిపారు. గణపతి ఆశీర్వాదంతో గత ఏడాది నుంచి ఏలూరు పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోగలిగామని, రాబోయే రోజుల్లో మరిన్ని పనులు పూర్తి చేస్తామన్నారు,

సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు : ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయచవితి సందర్భంగా పోలీస్ సిబ్బందికి ఎస్పీ కేపీఎస్.కిశోర్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడు అందరికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. వేడుకల్లో భద్రత నిబంధనలు పాటించి, పర్యావరణానికి హాని కలగకుండా విగ్రహాలను ప్రతిష్ఠించి, నదుల్లో, నీటి వనరుల్లో నిమజ్జనం బాధ్యతగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.


పట్టిసీమ ఫెర్రీ వద్ద పోలీసుల హెచ్చరిక బోర్డులు

గోదావరి రేవుల వద్ద జాగ్రత్త

పోలవరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గణనాథుల విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా వినియోగించే పట్టిసీమ ఫెర్రీ, ఇతర రేవుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ గణపతి నవరాత్రులలో నిమజ్జనాలు జరిగే సందర్భాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులకు సూచనలు హెచ్చరికలు ఇవ్వడం జరిగిందని, ఫెర్రీ రేవుల వద్ద షిఫ్టులవారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఎర్ర కాలువ జలాశయం వద్ద..

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ జలాశయంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కె.స్లీవజోజి సూచించారు. ఎర్రకాలువ జలాశయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు మంగళవారం పరిశీలించారు. జలాశయం వద్దకు విగ్రహాలతో పాటు పిల్లలను, మహిళలను తీసుకురావద్దని సూచించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, గజఈతగాళ్లను ఉంచాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.


ఆర్యన్ ఉభయ్‌ను సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

విద్యార్థులు అద్భుత విజయాలు సాధించాలి

స్వర్ణాంధ్ర విద్యార్థులతో లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉభయ్

నరసాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అద్భుత విజయాలు సాధించాలని, మనం సాధించిన విజయాన్ని మనం చెప్పుకోకూడదు.. నలుగురు చెప్పుకుంటేనే నిజమైన విజయమని లండన్ రాయల్ బారోటి డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉభయ్ అన్నారు. స్వర్ణాంధ్ర కాలేజీలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఎదుట వారిని ఎప్పుడు తక్కువగా అంచనా వేయరాదన్నారు. వివిధ రంగాల్లో రాణించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని వారిలా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే కచ్చితంగా ప్రతిభతో పాటు స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా ఉండాలన్నారు. మంచి ఆహార అలవాట్లను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. చేసే పనిలో స్వల్ప కాలిక ప్రయోజనాలతో సంతృప్తి చెందరాదన్నారు. ఎప్పుడు లాంగ్ టర్మ్ విజన్ కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. చైర్మన్ కె.సత్యనారాయణ, త్రినాథ్, శ్రీహరి, కీర్తి, బాబు, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, గోపిచంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఒప్పంద కార్యక్రమంలో ఏపీనిట్ డైరెక్టర్ రమణారావు, నామ్‌టెక్ ప్రతినిధులు

నామ్‌టెక్‌తో ఏపీ నిట్ ఒప్పందం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌కు చెందిన నామ్‌టెక్ స్టీల్ ఇండియాతో ఏపీ నిట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణరావు, నామ్‌టెక్ ప్రోగ్రాం డైరెక్టర్ కేసీ వీర ఒప్పంద పత్రాలపై మంగళవారం సంతకాలు చేశారు. ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటి, రోబోటిక్స్, స్పేస్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధ వంటి సాంకేతిక రంగాలలో పరస్పర సహకారం అందించుకునేందుకు మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మిషన్లు బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీటితో పాటు పరిశోధనలు, ఇన్నోవేషన్లు సంయుక్తంగా నిర్వహించడానికి పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా కరికులం రూపకల్పన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, స్టార్టప్‌లు, మెంటరింగ్, హ్యాక్‌థాన్ నిర్వహించడానికి విద్యార్థులు నామ్‌టెక్ ఫెలోషిప్ పొందడానికి కూడా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ జి.రవికిరణ్‌శాస్త్రి, నామ్‌టెక్ ప్రోగ్రాం డైరెక్టర్ వాసు వెలగపూడి, అసోసియేట్ డైరెక్టర్ అమిత్ పటేల్, నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు వి.సందీప్, హిమబిందు, వీరేశ్‌కుమార్, కార్తీక్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ బాలికల జట్టు

బాస్కెట్‌బాల్ విజేత ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాప్ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్ కప్ పేరుతో ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. బాస్కెట్‌బాల్ విభాగంలో జోన్ 2 ఫైనల్ పోటీలు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరిగాయి. బాలికల విభాగంలో ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఈనెల 29న విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో అందుకుంటారు.

క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, ఆగస్టు 26, (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే సెంట్రల్ జోన్ అంతర జిల్లా క్రికెట్ పోటీలకు అండర్-23 విభాగం క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు ఎస్‌కె షాకీర్ హుస్సేన్ తెలిపారు. డీకే రేవంత్ నాగ కుమార్ (కెప్టెన్), పి.భువనేశ్వర్ (వైస్ కెప్టెన్), కెకెఎస్ఎన్.హరీష్ (కీపర్), వీఎంవీఎస్ రక్షణ్, కె.జాన్ రిచర్డ్స్, వి.జస్విన్, ఎం.హర్షవర్ధన్, జి.దీపక్ చంద్, జి.చరణ్ సాయితేజ, ఎం రిత్విక్, మెహబూబ్ ఆలీ, చైతన్యకుమార్, బి.సాయి సుషానిన్, పార్థర్ శ్రీసాయి, వి.లోహిత్, కెఎస్ఎన్.రాజు, స్టాండ్‌బైగా ఆర్.కేశవ, డి యశ్వంత్, ప్రణీత్ పవన్, వి.జయంతి సాయి ఎంపియ్యారు.



కలెక్టరేట్ ఫైట్!

(7వ పేజీ తరువాయి)



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లేవనెత్తారు. కలెక్టరేట్‌ను భీమవరం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరు కోమంటూ వ్యాఖ్యానించారు. దీనిపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. పెదఅమిరంలో ఎటువంటి ఖర్చు లేకుండా నిర్మాణం చేపట్టాలని అనుకుంటున్నాం.ఇది భీమవరంలో భాగమే. కూతవేటు దూరంలోనే పెద అమిరం ఉంది. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉండదని ప్రకటించారు. ఇది విన్న భీమ వరం ఎమ్మెల్యే అంజిబాబు మరో ప్రకటన చేశారు. భ్రమలు వద్దు.. అపోహలు వద్దు. భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇలా జిల్లా కలెక్టరేట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు ఏమవుతుందోనని జిల్లా వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కలెక్టరేట్ తరలిస్తే ఉద్యమిస్తాం : కాంగ్రెస్, వైసీపీ

భీమవరం టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌ను తరలిస్తే ఉద్యమి స్తామని కాంగ్రెస్ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం హెచ్చరించారు. ప్రకాశం చౌక్‌లో మంగళవారం నిరసన తెలిపారు. భీమవరం పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయాల తరలింపు ఆపాలని లేకపోతే పెదఎత్తున ఉద్యమి స్తామని ప్రకటించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోనం రవికుమార్, కార్మిక కర్షక కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గంజాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తాం: వైసీపీ

భీమవరం నుంచి కలెక్టరేట్‌ను ఉండి నియోజకవర్గానికి తరలించాలని చూస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని వైసీపీ ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ హెచ్చరించారు.. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కలెక్టరేట్ కార్యాలయాన్ని ఉండి నియో జక వర్గం పెదఅమిరం తరలిస్తారని వస్తున్న వార్తలపై వైసీపీ నాయకులు మండి పడ్డారు. భీమవరం నుంచి జిల్లా కేంద్రం తరలించవద్దని, తరలిస్తే ఇది ప్రజా ఉద్యమంగా మారుతుందన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకటరాయుడు, పేరిచర్ల విజయనరసింహరాజు, గూడూరి ఉమాబాల, ఎఎస్ రాజు, గాదిరాజు రామరాజు, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్ పాల్గొన్నారు.


చిన్నారులతో సర్పంచ్ సుబ్బారావు దంపతులు

బాస్విని ట్రస్ట్ సేవలు అభినందనీయం

కాళ్ళ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట సర్పంచ్ సుబ్బారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్ అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 700 మంది విద్యార్థులకు గొడుగులు అందించారు. అనంతరం ఒక దివ్యాంగ యువకుడికి ట్రై సైకిల్‌ని గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు దంపతులు అందజేశారు. అనంతరం సుమారు 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

మోటార్ సైక్లిస్టు మృతి

పెనుగొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మునమర్రు గ్రామానికి చెందిన తానేటి సత్యానందం(37) తన మోటారు సైకిల్‌పై పెరవలి వెళ్తుండగా పెనుగొండలోని ఇండియన్ గ్యాస్ గొడౌన్ సమీపంలో వ్యాన్ ఢీకొట్టింది. సత్యానందం తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కార్యకర్తలను పట్టించుకోని కెఎస్‌ఎన్'

తాడేపల్లిగూడెం, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి):కార్యకర్తలను పట్టించుకోకుండా అప్పులపాలు చేసిన వ్యక్తి మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అని తాడేపల్లిగూడెం జడ్పీటీసీ సభ్యు డు ముత్యాల ఆంజనేయులు ఆరోపిం చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జడ్పీటీసీ మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసిన వారి వద్ద నుంచి నోట్లు రాయించుకుని వీధిన పడవేసిన ఘనత కొట్టు సత్యనారాయణకే దక్కుతుందన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మాజీ మంత్రి నిలుస్తారన్నారు. కార్యకర్తను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, నాయ కులు నీలపాల దినేష్, సజ్జా సుబ్బు, నల్లగంచు రాంబాబు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత మంచినీరు అందించే పనిలో ఎలాంటి అవకతవకలు లేకుండా నాణ్యతతో పని చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బీవీ గిరి సూచించారు. బంగారుగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంలో ఐరెన్ వర్క్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.

రైతులను ఆదుకుంటాం

ఇరగవరం, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ భరోసా ఇచ్చారు. ఇరగవరం మండల పరిధిలో ముంపునకు గురైన వరి చేలను ఆయన మంగళవారం పరిశీలించారు. రైతును ఆదుకునేందుకు మంత్రి అచ్చెంనాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో మాట్లాడతానని ఎమ్మెల్యే వెల్లడించారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

భీమవరంటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణానికి మేలు అని, మట్టి వినాయకుడినే పూజించాలని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ అన్నారు. భీమవరం వీరమ్మ పార్కుసెంటర్‌లో వరల్డ్ హ్యూమన్స్ రైట్స్ వాసవి జాగృతి విజెఎఫ్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమలను ఎంపీ సత్యనారాయణ పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ భగవంతుడు సృష్టించిన సృష్టిని మనం కలుషితం చేయకూడదన్నారు. కార్యక్రమంలో పర్రిపాటి శ్రీనివాస్ క్లబ్ ట్రెజరర్ సంక గోపి, సెక్రటరీ సుబ్బుశెట్టి గణేష్, నాగసూరి మురళీమోహన్, చెరుకువాడ రంగసాయి, నులి ప్రసాద్, ఓలేటి శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

యువకుడికి చెప్పుల దండ వేసిన 15 మందిపై కేసు

యలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మేడపాడు గ్రామంలో రెండు కులాలపై దుర్భాషలాడాడని ఒక యువకుడిని నిర్బంధించి, చెప్పుల దండ వేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఇదే యువకుడు రెండు కులాలను కించపరిచేలా మాట్లాడిన కాల్ రికార్డింగ్ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తుందని ఆ యువకుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని దళితసంఘాల నాయకులు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పసిబిడ్డ మృతిపై ఉన్నతాధికారుల ఆరా

తణుకు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి పసిబిడ్డ మృతి చెందిన సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీశారు. నిడదవోలు మండలం పందలపర్రు గ్రామానికి చెందిన లక్ష్మీదుర్గ ప్రసవం నిమిత్తం ఆదివారం తణుకు జిల్లా ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తీసుకు వచ్చారు. అక్కడ వైద్యులు నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందినట్లు సోమవారం రాత్రి బంధువులు ఆందోళన చేశారు. వాస్తవానికి కడుపులో ఉన్న బేబీకి నెలలు నిండినప్పటికి ఉండాల్సిన బరువు కన్నా తక్కువగా ఉండటంతో పాటు, అదే సమయంలో బేబీ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తినట్లు తెలిసిందని వైద్యులు తెలిపారు. అయితే వాస్తవాలు రాబట్టేందుకు ఉన్నతాధికారులు విచారణ కమిటి ఏర్పాటు చేస్తారని అధికారులు చెప్పారు. డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ పలు వివరాలు అడిగినట్లు తెలిపారు. విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతాయని సూపరింటెండెంట్ సాయి కిరణ్ వివరించారు.













29న మెగా జాబ్ మేళా

పాలకొల్లు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీ తమ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈజాబ్‌మేళాలో 10 కంపెనీలు నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. ఇంటర్వ్యూలకు డిగ్రీ, ఆఖరి సంవత్సరం చదివే వారు,ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 70136 29841 ఫోన్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రకృతి విపత్తులపై మాక్ డ్రిల్

యలమంచిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపట్ల హైస్కూల్ ప్రాంగణంలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలు ఏ విధంగా తమను తాము రక్షించుకోవాలి.. ఇతరులను ఎలా రక్షించాలో చేసి చూపించారు. గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు వ్యాపిస్తే తక్షణమే వాటిని ఎలా అదుపుచేయాలో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు బీజేపీ అధ్యక్షుడిగా చెన్నకేశవులు


చెన్న కేశవులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మొగల్తూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయ సమీపంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడుగా కొల్లాటి చెన్న కేశవులు, ప్రధాన కార్యదర్శులుగా బొరుసు శివ, దొంగ శ్రీనివాస్‌లను ప్రకటించినట్టు ఆపార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు, వనలమాల శ్రీనివాస్, నడిపూడి పెద్దిరాజు, మండల పార్టీ ఇన్‌చార్జ్ లీలా కృష్ణ, దాసరి బాబి, ఎంపీటీసీ తిరుమాని స్వామి, పులపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎంపికపై కార్యకర్తల అసంతృప్తి

ఇదిలా ఉండగా మండల బీజేపీ కమిటీలో మండల పదాధికారులు, బూత్ కమిటీల ప్రతినిధులు, శక్తి కేంద్ర కమిటీ ప్రముఖుల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా పరిశీలకులు కొత్తవారిని ప్రకటించారంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. దీనిపై తాము రాష్ట్ర కమిటీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

భీమవరం క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసుకుంటే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు అన్నారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక జీవీఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ (న్యూటన్), ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎస్.సుధీర్, పి.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

'తీర్మానాలు చేస్తున్నా పనులు జరగడం లేదు'

ఆచంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన భీమవరానికి నియోజకవర్గ కేంద్రమైన ఆచంట నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎంపీపీ, ఎంపీడీవో తోపాటు పలువురు సభ్యులు కోరారు. మంగళవారం ఆచంట మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అధ్యక్షతన జరిగింది. ఆచంట మండలంలో నిరంతరం విద్యుత్‌సరఫరాలో తలెత్తుతున్న సమస్యలతో తరచూ విద్యుత్‌సరఫరా ఉండటం లేదని పలువురు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశంలో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేస్తున్నా పనులు జరగడం లేదని అన్నారు.


తణుకు మాంటిస్సోరి స్కూల్‌లో విజేతలకు బహుమతులు అందజేత.. ప్రగతి జూనియర్ కాలేజీలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న వైస్ ఛైర్మన్ రాజేశ్వరి.. ప్రత్తిపాడులో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న 3 ఎఫ్ ఇండస్ట్రీస్ ఎండీ గోయంకా

మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దాం

తణుకు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి విగ్రహాలనే పూజిద్దామని మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. మంగళవారం 4నుంచి 9 తరగతులు విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వంటివి వాడి పర్యావరణాన్ని పాడుచేయవద్దన్నారు. ప్రముఖ సిద్ధాంతి జి.వి.మాధవ శర్మ, ఆర్ట్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రగతి జూనియర్, డిగ్రీ కాలేజితో పాటు ప్రగతి విద్యాలయలో విద్యార్థులకు నాలుగువేల మట్టి గణపతి విగ్రహాలను ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ ప్రగతి రాజా, వైస్ ఛైర్మెన్ రాజేశ్వరి పంపిణీ చేశారు. ఆంధ్రాషుగర్స్ ఆధ్వర్యంలో వెంకట్రాయపురం పార్కు వద్ద రెండు వేల మందికి ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ఆంధ్రాషుగర్స్ వైస్ ప్రెసిడెంట్, అడిషనల్ సెక్రటరీ పి.వి.యస్. విశ్వనాథ కుమార్, అడ్వైజర్ జి.రంగారావు, కె.వెంకటరత్నం, జీఎం పి.శ్రీనివాసు పాల్గొన్నారు.

పెంటపాడు: 3ఎఫ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్తిపాడులో 400 మందికి మట్టి వినాయక ప్రతిమలను సంస్థ ఎండీ ఓపీ.గోయంకా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్ జీ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం, నిడమర్రు మండలాల మెడికల్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపవరంలో ఉచితంగా మట్టివినాయక విగ్రహాలను మెడికల్ సంఘ అధ్యక్షుడు సుబ్బరాజు పంపిణీ చేశారు. షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయప్రతిమలను భక్తులకు అందజేశారు.

165 మందిపై పింఛన్ అనర్హత వేటు

భీమవరం టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రూ.15వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు డాక్టర్లు వెళ్లి తనిఖీ చేయగా 165 మంది అనర్హులుగా గుర్తించినట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 1510 మంది రూ.15వేలు చొప్పున పింఛన్ పొందుతున్నారని వీరిలో 658 మంది ఆరోగ్య పింఛన్‌కు అర్హత వారిగా గుర్తించామన్నారు. మిగిలిన వారిలో 603 మంది దివ్యాంగుల పెన్షన్ నకు అర్హతగా గుర్తించగా, 84 మందిని వృద్ధాప్య పెన్షన్‌లు పొందుటకు వైద్య బృందం గుర్తించిందని, 165 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. దివ్యాంగుల పెన్షన్ అప్పీల్ ప్రకియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు, తాము అర్హులమని భావించినట్లయితే, తమ సమీప మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) లేదా మునిసిపల్ కమిషనర్లకు తమ అర్జీని సమర్పించవచ్చునని తెలిపారు.

ఉండిలో ఎరువుల దుకాణాల తనిఖీ

ఉండి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని ఆకివీడు ఏడీఏ కె.ప్రతాప్‌జీవన్, ఉండి మండలం వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఉండిలోని ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఉండి మండలంలో కాంప్లెక్స్ ఎరువులు తగినంత నిల్వలున్నాయని తెలిపారు. యూరియకు సంబంధించి సొసైటీలో , ప్రైవేట్‌షాపులలో కలిపి సుమారు 100టన్నులు వరకు అందుబాటులో వున్నాయన్నారు. ఏ విధమైన కొరత లేదన్నారు. ఉన్న స్టాకులు అయిపోయే సమయానికి రైతులకు కావలసిన మోతాదులో స్టాక్‌లను వెంటనే ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా కొవ్వలి జన్మదిన వేడుకలు


అన్నదానం చేస్తున్న సీఐ యాదగిరి, టీడీపీ నాయకులు

నరసాపురం టౌన్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు జన్మదిన వేడుకల్ని టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను నిమ్మకాయల గోపాలరావు, నీలిమ, కొండా శ్రీధర్‌లు కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చారు. బండారు విశ్వమోహన్ ఆర్థిక సహకారంతో లెప్రసీ కాలనీలోని అన్నదానం చేశారు. సీఐ యాదగిరి పేదలకు భోజనాలు వడ్డించారు. పలువురు కొవ్వలికి ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు: మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొవ్వలి జన్మదిన కేక్‌ను కార్యకర్తలు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, డొల్లా రత్నంరాజు, కత్తిమండ అుత్యాలరావు, పిఎంఎ రాజు పాల్గొన్నారు.




శృంగవృక్షంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి.. మండపాకలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

స్మార్ట్ కార్డుల పంపిణీ

పాలకోడేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మంగళవారం రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ సుమారు రూ. 30 లక్షల వ్యయంతో ఈ ఉన్నత పాఠశాలలో 4 అదనపు తరగతి గదులను నిర్మించిన దాతలు సయ్యపరాజు అప్పల నరసింహరాజు- పార్వతి దంపతులను అభినందించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ పాఠశాలలో ప్రవేశానికి సీటు దొరకదు అనే విధంగా పాఠశాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ పాల్గొన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

తణుకు రూరల్: ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు పారదర్శకంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం మండపాక గ్రామంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తణుకు నియోజకవర్గంలో సుమారు 86 వేల స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండపాక గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జానా వెంకట లక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ కొండేటి శివ, వైస్ ఛైర్మన్ వల్లూరి రామ్మోహన్, ఉప సర్పంచ్ నాగేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు అత్మకూరి రామకృష్ణ పాల్గొన్నారు.